సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 28 । నవంబర్ । 2023



కడపలో సినీతారల క్రికెట్ మ్యాచ్

కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా సినీతారల క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. డిసెంబర్, జనవరి మొదటి వారంలో మ్యాచ్ జరగనుంది. - 8లో



కారును ఢీ కొన్న లారీ

సంబేపల్లె మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం కారును గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఒకే కుటుంబంలోని ముగ్గురు గాయపడ్డారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31.2 /23.0

వాతావరణం

జిల్లాలో సోమవారం 23.0 - 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

సమ్మేటివ్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షలు
- 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	:2065
ఎయిడెడ్	:67
ప్రైవేటు పాఠశాలలు	:775
అన్ని యాజమాన్యాల్లో విద్యార్థులు	:3,13,696
టోఫెల్‌కు సంబంధించిన పాఠశాల వివరాలు...	
టోఫెల్ అమలవుతున్న పాఠశాలలు	:474
3 నుంచి 5వ తరగతుల విద్యార్థులు	:20110
6 నుంచి 9వ తరగతులవారు	:50740



సమ్మేటివ్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వెలికి తీసేందుకు నిర్వహించే సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ)-1 పరీక్షలు జిల్లావ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ పరీక్షలను సంబంధించిన ప్రశ్నపత్రాలు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ)నుంచి జిల్లా కేంద్రానికి, అక్కడి నుంచి మండల కేంద్రాలలోని ఎమ్మార్సీలకు కూడా చేరాయి. ఈ సారి టోఫెల్ పరీక్షలకు కూడా ప్రింటెడ్ ప్రశ్నపత్రాలను సరఫరా చేశారు. ఇందులో 1 నుంచి 9వ తరగతి వరకు బైలింగ్విల్ విధానంలో.. 10వ తరగతికి వారికి మాత్రం మీడియం వారీగా ప్రశ్నపత్రాలు వచ్చాయి. వీటిపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూ ఆర్ కోడ్ కేటాయించారు. పేపర్లను ఎవరైనా లీక్ చేస్తే ఏ పాఠశాల నుంచి ప్రశ్నపత్రం లీక్ అయిందనే విషయాన్ని క్షణాల్లో బయటపడే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో నేటి నుంచి ఈ సమ్మేటివ్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

షెడ్యూల్ ఇదీ..

జిల్లాలో 2 వేలకుపైగా ప్రభుత్వ, 67 ఎయిడెడ్, 775 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిన్నింటిలో 3,13,696 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ నేటి నుంచే పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

- 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 28వ తేదీన తెలుగు, డిసెంబర్ 1న ఇంగ్లీషు, 2న గణితం, 4న పరిసరాల విజ్ఞానం, 5న ఇంగ్లీషు పార్ట్- బి టోఫెల్ పరీక్ష ఉంటుంది. వీరందరికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు ఉంటాయి.
- 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న హిందీ, 2న ఇంగ్లీషు, 4న గణితం 5న ఫిజికల్ సైన్స్, 6న బయోలాజికల్ సైన్స్, 7న సోసియల్ స్టడీస్, 8న ఇంగ్లీషు పార్ట్- బి టోఫెల్ పరీక్షలు ఉంటాయి. ఇందులో 6,8,10 తరగతులకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు, 7,9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 1 నుంచి 8 తరగతులకు 80 మార్కులకు, 9,10 తరగతులకు 100 మార్కులకు పశ్నపత్రం ఇస్తారు. ఇందుకు సంబంధించిన మార్కులను ఆయా పాఠశాలల హెడ్‌టీచర్లు, హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

తొలిసారి టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు...

ఇంగ్లీషులో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేందుకు ప్రభుత్వం టోఫెల్ విద్యను ప్రవేశపెట్టింది. జిల్లాలో 36 మండలాల పరిధిలో 474 స్కూళ్లలో ఇది అమలు జరుగుతుంది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు ఉన్న పాఠశాలల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లోనే నిర్వహించారు. తొలిసారిగా ఎస్‌సీఈఆర్‌టీ వారు ఈ పరీక్ష నిర్వహణ కోసం ప్రింటెడ్ పేపర్లను సరఫరా చేసింది.

హెచ్‌ఎంలు జాగ్రత్తలు పాటించాలి



సమ్మేటివ్ అసెస్‌మెంట్‌కు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఆయా మండలాల్లోని ఎమ్మార్సీల కేంద్రాలకు చేర్చాం. అక్కడ నుంచి ప్రధానోపాధ్యాయులు ఆ రోజు పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాన్ని ఒక గంట ముందు పాఠశాలకు తీసుకెళ్లాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు పాటించాలి. ఏదైనా పొరపాటు జరిగితే మీరే బాధ్యులవుతారనే విషయాన్ని గమనించాలి.
– శంకరయ్య, సెక్రెటరీ, జిల్లా కామన్ ఎక్సామినేషన్ బోర్డు(డీసీఈబీ), కడప.

పొరపాట్లకు తావివ్వొద్దు



సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల్లో పొరపాట్లు జరగకుండా ప్రధానోపాధ్యాయులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్ష ప్రారంభానికి గంట ముందు మాత్రమే ప్రశ్నపత్రాన్ని వారి పరిధిలోని ఎమ్మార్సీల నుంచి తీసుకెళ్లాలి. ఏదైనా పొరపాటు జరిగితే మాత్రం ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సేంద్రీయ పంటలను అంతర్జాతీయ బృందంతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలనలో భాగంగా లావోవోస్, భారత్, కెన్యా, జింబాబ్వే, సెనెగల్, ట్యునీషియా, పెరూ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు , పరిశోధకులు చిన్నమండెం సమీపంలో ఏపీసీఎన్‌ఎస్ ప్రాజెక్టు ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సిరాడ్, వరల్డ్ ఫిష్, అలయన్స్, బయోడైవర్సిటీ, ఓఈపీ, ఇనేరా సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. సేంద్రియ పంటలను అంతర్జాతీయ బృందంతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి , రసాయన వ్యవసాయాల మధ్య తేడాలను వివరించారు. జగనన్న ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌కు 80 నుంచి 90శాతం వరకు సబ్సిడీ అందిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంటల వాడకం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. తమ ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగవుతున్న పంటలను పరిశీలించడానికి వచ్చిన అంతర్జాతీయ బృందానికి అభినందనలు , కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సాధికారిక సంస్థ అధికారులు చంద్రశేఖర్, టీం లీడర్ ధర్మేంద్ర, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణమరాజు, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నూతన కమిటీ ఎంపిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సేవా సంఘం జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కడప హోచిమిన్ భవన్‌లో సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీసెస్ అసోసియేషన్ కడప జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గాలి చంద్ర, జిల్లా అధ్యక్షుడిగా కోడూరు పుల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొట్ల నాగసుబ్బయ్య యాదవ్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా కేసీ బాదుల్లా, ఉపాధ్యక్షుడిగా గాలిశెట్టి భాస్కర్, నాగదాసరి ఇమ్మానుయేల్, యం.లక్ష్మీనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శులుగా చెప్పలి మణికుమార్, నాగిపోగు కర్ణ, చంద్రమ్మగారి శ్రీలక్ష్మి, కోశాధికారిగా పోలు రామమోహన్‌తో పాటు మరో 9 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



స్టాఫ్ నర్స్ నియామకాలను చేపడుతున్న మెడికల్ అండ్ హెల్త్ ఆర్డీ డాక్టర్ రత్నకుమారి

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో సోమవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం మీటింగ్ హాల్‌లో నిర్వహించిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. రాయలసీమ వ్యాప్తంగా మొత్తం 95 పోస్టుల నియామకాలకు నిబంధనల ప్రకారం 95 మందిని ఎంపిక చేశారు. అందులో కౌన్సెలింగ్‌కు 61 మంది హాజరై నియామక పత్రాలను పొందారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి, డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంపు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, సప్లిమెంటరీ 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థులు చెల్లించే ఫీజు గడువును 28వ తేదీ వరకు పొడిగించినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి తెలిపారు. రూ.200 ఫైన్‌తో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. విద్యార్థుల నుంచి సేకరించిన ఫీజును ప్రిన్సిపాల్స్ డిసెంబర్ 1వ తేదీన బ్యాంకులో జమచేసి, సంబంధిత రసీదును పరీక్షల విభాగానికి సమర్పించాలన్నారు.

చర్చి తిరునాల పోస్టర్లు విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న ఐజాక్‌వరప్రసాద్

కలసపాడు : స్థానిక పరిశుద్ధ పరిపేతురు పరిశుద్ధపౌలు చర్చి తిరునాల 136వ వార్షికోత్సవం డిసెంబర్ 2, 3వ తేదీల్లో నిర్వహించనున్నారు. సోమవారం దీనికి సంబంధించిన పోస్టర్లను బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పి.ఐజాక్‌వరప్రసాద్ విడుదల చేశారు. తిరునాలకు అందరూ వచ్చి దేవుని ఆశీర్వాదాలు పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెవ. సంజయ్‌మధు, బేబీసరోజ, రవిక్రీస్తుదారి, శ్రీనివాస్‌పాల్, మోజెస్, రవి, ప్రవీణ్ (చిన్ను) తదితరులు పాల్గొన్నారు.

3న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్ : జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్) డిసెంబర్ 3వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు హాజరవుతున్నవారి హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www.bre.ap.gov.in నందు స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. కావున సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూ డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి విద్యార్థుల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ఐఎస్‌టీఏ సందర్శన

పులివెందుల రూరల్ : పులివెందులలోని వైఎస్సార్ ఐఎస్‌టీఏ(ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడెమీ)ను సీడాప్ సీఈఓ శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. కళాశాలలోని అన్ని ల్యాబ్‌లు, శిక్షణా పరికరాలను పరిశీలించి శిక్షణా విధానాల గురించి ట్రైనర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులను శిక్షణ గురించి, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్, ఏపీఎస్‌ఎస్‌డీసీ కో-ఆర్డినేటర్ తరుణ్, జాబ్స్ కో-ఆర్డినేటర్ దివాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి



క్రీడా సామగ్రి పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ విజయ రామరాజు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేసీ గణేష్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. డిసెంబరు 15 నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజులపాటు గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో క్రీడలు ఉంటాయన్నారు. డిసెంబరు 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయిలో, జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. జనవరి 11 నుంచి 20వ తేది వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఈరోజు నుంచే రిజిస్ట్రేషన్ లింక్ ప్రారంభించామన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆడుదాంఆంధ్ర. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే 1902కు కాల్ చేసి నమోదు కావచ్చన్నారు. వలంటీర్ల వద్ద కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. డిసెంబరు 4 నుంచి వలంటీర్లు ఆడుదాం ఆంధ్రపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి


స్పందన కార్యక్రమంతో పాటుమండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో జరిగిన 'స్పందన' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్వో గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్లు కౌసర్ భాను, ప్రత్యూష లు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

గృహాలు, ప్రాధాన్యత భవనాల నిర్మాణంపై దృష్టి

జగనన్న హౌసింగ్ కాలనీలు, సచివాలయం తదితర ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సచివాలయాలు, ఇతర భవనాల నిర్మాణంలో అలసత్వాన్ని సహించబోమని హెచ్చరించారు.

వైభవం.. ఉరుసు ఉత్సవం





దర్గా ఆవరణలో భక్తుల సందడి (ఇన్‌సెట్) ప్రార్థనల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కలెక్టర్ విజయరామరాజు, తదితరులు

కడప కల్చరల్ : పెద్దదర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు సోమవారం రెండోరోజు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, అధికారులు వన్‌టౌన్ సర్కిల్ నుంచి పూలచాదర్ సంప్రదాయంగా తీసుకుని వైవీ స్ట్రీట్ మీదుగా దర్గాకు ఊరేగింపుగా చేరుకున్నారు. అంతకుముందు దిశ పోలీసుస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్ ప్రసంగాల అనంతరం నిర్వాహకులు అతిథులకు పేటాలు అలంకరించారు. అట్టహాసంగా బ్యాండు మేళాల మధ్య అధికారులు చాదర్‌ను ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. అనంతరం పీఠాధిపతి ఆధ్వర్యంలో గురువుల మజార్‌పై చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫకీర్లు భక్తి గీతాలాపనలు చేశారు. తరువాత ముషాయిరా హాలులో జాతీయ స్థాయి ఖవ్వాలీ గాయకులు నిర్వహించిన కచేరీ భక్తులను ఉర్రూతలూగించింది. ఫకీర్ల విన్యాసాలు, బ్యాండు మేళాల మధ్యన దర్గా పీఠాధిపతి గంధం కలశాన్ని ఊరేగింపుగా వచ్చి దర్గాలోని గురువు మజార్ వద్ద సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా నిర్వహించారు.

పోటెత్తిన జనం

పెద్దదర్గా ఉరుసు ఉత్సవానికి భక్తజనం పోటెత్తారు పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. పీఠాధిపతిని కలిసి ఆశీస్సులు పొందారు.

పుష్పగిరి కొండపై దీపాలు వెలిగిస్తున్న భక్తులు, లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి





శంకరా.. శుభంకరా..

కార్తీక సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సందడి నెలకొంది. శివాలయాల ప్రాంగణాలు హరనామ స్మరణతో మార్మోగాయి. కార్తీక దీపారాధనతో ఆలయాలు కాంతులీనాయి.ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పగిరిలో తెల్లవారు జాము నుండే భక్తులు పెన్నానదిలో స్నానాలు ఆచరించి కొండపై గల శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి , సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ధ్వజ స్థంభం వద్ద , ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి కొండ పైన గల శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. భానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రంలో ధ్వజస్థంభం శిఖరాగ్రంపై ఆకాశ దీపాన్ని వెలిగించారు. – సాక్షి నెట్ వర్క్



భానుకోట క్షేత్రంలో దీపాల వెలుగులు

దశాబ్దాల కల సాకారం

- చిట్వేలి, రైల్వేకోడూరు రోడ్డు విస్తరణకు జీఓ జారీ
- రూ. 40 కోట్లతో పనులు
- ఫలించిన విప్ కొరముట్ల కృషి



రైల్వేకోడూరు-చిట్వేలి రోడ్డు మార్గం

ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు-చిట్వేలి మధ్య దాదాపు 26 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ప్రభుత్వం సోమవారం జీఓ జారీ చేసింది. దీంతో రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల సాకారం కానుంది. ఇందుకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రభుత్వం ద్వారా రోడ్డు విస్తరణకు సంబంధించి జీవో తీసుకువచ్చారు. రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి విద్య, వాణిజ్యం కోసం ప్రతినిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. చిట్వేలి-రైల్వేకోడూరు మధ్య రహదారి వెడల్పు చిన్నదిగా ఉండటంతో ఎదురుగా వాహనం వస్తే పక్కకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు సంభవించాయి. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు అంగవైకల్యానికి గురయ్యారు. దాదాపు 40 సంవత్సరాలుగా ఈ మార్గం విస్తరించాలని ప్రజలు, నాయకులు కోరుతున్నారు. నేటి వరకు వారి కల కలగానే మిగిలింది. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఎన్నికల ముందు, తర్వాత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే గ్రామాల నాయకులు, ప్రజలు చిట్వేలి-రైల్వేకోడూరు విస్తరణ పనులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన రోడ్డు పనుల గురించి ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. జీఓ జారీచేయించారు. ప్రజల కలను నెరవేర్చారు. రోడ్డు విస్తరణ జరిగడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చు. అంతేకాకుండా రైల్వేకోడూరు నుంచి చిట్వేలి, పెనగలూరు, రాజంపేట, రాపూరు, నెల్లూరు విజయవాడకు వెళ్లేందుకు ఈ రోడ్డు ఉపయోగపడనుంది.

మార్చినాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు..



దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న చిట్వేలి-రైల్వేకోడూరు మార్గం రోడ్డు విస్తరణ పనులు 2024, మార్చి నెలకల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు రూ. 40 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం ద్వారా జీఓ తీసుకొచ్చాం. వెంటనే టెండర్లు పిలిచి పనుల వేగవంతానికి కృషి చేస్తున్నాం.
– ప్రభుత్వం విప్ కొరముట్ల శ్రీనివాసులు

కడప గడపలో సినీతారల క్రికెట్ మ్యాచ్

- డిసెంబర్ చివరి లేదా జనవరి మొదటివారంలో నిర్వహణ
- బాలీవుడ్, టాలీవుడ్ తారలతో ఫ్లడ్‌లైట్ వెలుగుల్లో సెలబ్రిటీ మ్యాచ్
- ఉచిత ప్రవేశం
- మైదానాన్ని పరిశీలించిన సినీ నటులు శ్రవణ్, ఖయ్యూం, మధునందన్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా సినీతారల క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. డిసెంబర్ చివరివారం లేదా జనవరి మొదటివారంలో టాలీవుడ్, బాలీవుడ్ నటులతో కూడిన క్రికెట్ జట్లు కడప నగరంలో క్రికెట్ మ్యాచ్ ఆడనున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానాన్ని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, ఏసీఏ సీఈఓ ఎం. వెంకటశివారెడ్డితో కలిసి ప్రముఖ సినీనటులు శ్రవణ్, ఖయ్యూం, మధునందన్, సీసీసీ చైర్మన్ షకీల్‌షఫీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా క్రికెట్ నెట్స్‌లో సినీనటులు కొద్దిసేపు ప్రాక్టీస్ చేసి సందడి చేశారు.


మాట్లాడుతున్న సీపవైడీ జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి

ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో.. సినీతారల మెరుపులు..

కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో సినిమా తారలు విచ్చేసి క్రికెట్ మ్యాచ్ ఆడనున్నట్లు చారిటీ క్రికెట్ క్లబ్ (సీసీసీ) చైర్మన్ షకీల్ షఫీ పేర్కొన్నారు. స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే అంశాలపై చైతన్యం తీసుకువచ్చేందుకు చారిటీ మ్యాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా వరుసగా సినీతారలతో వివిధ ప్రాంతాల్లో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ యేడాది కడప వేదికగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో నిర్వహించే మ్యాచ్‌కు బాలీవుడ్ నటులు, టాలీవుడ్ నటులు హాజరవుతారని తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి మాట్లాడుతూ కడప వేదికగా రంజీ మ్యాచ్‌లు, జాతీయస్థాయి మ్యాచ్‌లు నిర్వహించామని, తొలిసారిగా సినీతారల క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్లడ్‌లైట్లను ప్రారంభించిన తర్వాత డిసెంబర్ చివరి లేదా జనవరి మొదటివారంలో మ్యాచ్‌ను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు, క్రికెట్ అభిమానులు మ్యాచ్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీఈఓ ఎం. వెంకటశివారెడ్డి మాట్లాడుతూ చారిటీ క్రికెట్ క్లబ్ పేరుతో 2011 నుంచి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీసీసీఐ, ఏసీఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలో క్రికెట్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సినీతారల క్రికెట్ మ్యాచ్ అలరిస్తుందన్నారు. ఈ మ్యాచ్‌కు ఎలాంటి రుసుం లేకుండా ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం సినీనటులను క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సీఏవైడీ ప్రతినిధులు ఎల్. మునికుమార్‌రెడ్డి, పృథ్వీ, పరిపాలనాధికారి శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయి స్టేడియంలా ఉంది..: ప్రముఖ విలన్ శ్రవణ్

కడప నగరంలో ఇంత చక్కటి క్రికెట్ స్టేడియం ఉంటుందని ఊహించలేదు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన స్టేడియం ఉండటం, ఈ మైదానంలో మాకు ఆడే అవకాశం రానుండటం సంతోషంగా ఉంది. సేవా కార్యక్రమాలకు మావంతు సహకారంగా మ్యాచ్‌లు ఆడనున్నాం.

అందరూ వీక్షించండి..: హాస్యనటుడు ఖయ్యూం

నేను క్రికెటర్‌గా దుబాయ్, సౌత్ ఆఫ్రికా, ఆస్ట్రేలియా తదితర దేశాలన్నింటినీ చూశాను.. ఆ తరహాలో కడపలో మైదానం ఉండటం మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇక్కడ మైదానం చూసిన తర్వాత 200 శాతం సంతోషంతో మ్యాచ్ ఆడేందుకు వస్తున్నాం. కడప ప్రజలు, క్రీడాభిమానులు విచ్చేసి వీక్షించండి.


బ్యాటింగ్ చేస్తున్న కమెడియన్ మధునందన్


బౌలింగ్ చేస్తున్న ప్రముఖ విలన్ శ్రవణ్

ఉన్నత ప్రమాణాలు కలిగిన మైదానం : హాస్యనటుడు మధునంద్‌న్

కడపలోని స్టేడియం అంతర్జాతీయ ప్రమాణాలతో చక్కగా ఉంది. ఇక్కడి పచ్చిక, పిచ్ చాలా బాగున్నాయి. ఇంత చక్కటి మైదానం ఉండటం మాకు ఆశ్చర్యం కలిగించింది. సినీతారల మ్యాచ్‌ను అందరూ వీక్షించాలని కోరుకుంటున్నాం.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
–సాక్షి నెట్‌వర్క్

నాడు–నేడుతో సౌకర్యాలు మెరుగు



ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక సౌకర్యాలు మెరుగు పరిచారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు వెచ్చించి ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారి పోయాయి. మాకు పాఠాలు చెప్పడంలోనూ, విద్యార్థులు చదువుకోవడంలోనూ శ్రద్ధ పెరిగింది. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందుతోంది.

– బడుగు ఓబులేసు,ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఎంపీపీ స్కూల్, ఎస్టీ కాలనీ, కమలాపురం

పింఛన్ మంజూరైంది



గతంలో టీడీపీ ప్రభుత్వంలో మా గ్రామంలో రెండు మూడు సార్లు జన్మభూమిలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. కానీ జన్మభూమి కమిటీ వారు మంజూరు చేయలేదు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం వచ్చిన వెంటనే నాకు పింఛన్ మంజూరైంది. అర్హత ఉంటే చాలు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వాళ్లకు మంజూరు చేస్తున్నారు. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఆర్. లక్ష్మీనారాయణరెడ్డి, బి.కొట్టాలపల్లె, కొండాపురం మండలం.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

సెంట్రల్‌జోన్, నార్త్‌జోన్‌లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాల్లో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ క్రికెట్ పోటీల్లో తొలిదశలో నిర్వహించిన రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడోరోజు సోమవారం 137 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 99.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్‌రెడ్డి 88 పరుగులు, తేజ 68 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు వాసు 3, గణేష్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులు చేయగా, నార్త్‌జోన్ జట్టు 272 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో మ్యాచ్ ఫలితం తేలకపోవడంతో డ్రాగా ముగియగా, నార్త్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.


81 పరుగులు చేసిన సెంట్రల్‌జోన్ జట్టు బ్యాట్స్‌మన్ వంశీకృష్ణ


88 పరుగులు చేసిన రెస్ట్ ఆఫ్ జోన్ బ్యాట్స్‌మన్ రేవంత్‌రెడ్డి


5 వికెట్లు తీసిన సౌత్‌జోన్ బౌలర్ ఆదిల్‌హుస్సేన్

కేఎస్ఆర్ఎం మైదానంలో..

36 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. జట్టులోని ఎం. వంశీకృష్ణ 81 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్ ఆదిల్‌హుస్సేన్ 5 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో సెంట్రల్‌జోన్ జట్టు 374 పరుగులు చేయగా, సౌత్‌జోన్ జట్టు 362 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, సెంట్రల్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

కారును ఢీ కొన్న గుర్తు తెలియని లారీ

సంబేపల్లె: సంబేపల్లె మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు జమ్మలమడుగు టౌన్‌కు చెందిన మహేంద్ర నాగోజీరావు సతీమణి రూప, కుమారుడు నితిన్, కుమార్తె అనితలు తమిళనాడులోని అరుణాచలానికి కారులో వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని గంగా హోటల్ సమీపలో ఆదివారం తెల్లవారుజామున రాయచోటివైపు నుంచి వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రూప, నితిన్, అనితలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనం సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సంబేపల్లె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

మార్కెట్‌లో చిరుధాన్య ఉత్పత్తులకు మంచి డిమాండ్

కడప అగ్రికల్చర్: రైతులు పండించే చిరుధాన్య ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ఊటుకూరు ఏరువాక కేంద్ర విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ రామలక్ష్మిదేవి అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–23 సందర్భంగా ఊటుకూరు ఏరువాక కేంద్రం, వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం వారి సహకారంతో చిరుధాన్యాల విలువ జోడింపుపై యువ, మహిళా, అభ్యుదయ రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఏరువాక కేంద్ర విస్తరణ శాస్త్రవేత్త, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రామలక్ష్మిదేవి వారిని నైపుణ్య శిక్షణలో భాగంగా ప్రాసెసింగ్ యూనిట్, ఔట్‌లెట్ యూనిట్‌లకు విజ్ఞానయాత్రకు తీసుకెళ్లారు. ఇందులో భాగంగా సీకేదిన్నె మండలం తాడిగొట్ల గ్రామంలో అవని ఆర్గానిక్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను సందర్శించారు. సంస్థ యజమాని సునీల్‌కుమార్ చిరుధాన్యాలను శుద్ధి చేసి పొట్టు తీసే విధానాలు, వాటికి అవసరమయ్యే యంత్ర పరికరాలు, వాటి తయారీకి అయ్యే ఖర్చు గురించి వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరుధాన్య ఉత్పత్తులకు ఇతర రాష్ట్రాలలో మంచి డిమాండ్ ఉందన్నారు. అనంతరం కడప రైతుబజార్‌లో నిర్వహిస్తున్న చిరుధాన్యాల ఔట్‌లెట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యువ, మహిళా, అభ్యుదయ రైతులతోపాటు కేవీకే ఏరువాక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.


కడప రైతుబజార్‌లోని చిరుధాన్యాల ఔట్‌లెట్‌ను పరిశీలిస్తున్న మహిళా, అభ్యుదయ రైతులు

నెరవేరిన దళితుల చిరకాల కల

ఎమ్మెల్యే, ఆర్డీఓ చేతులమీదుగా పట్టాలు పంపిణీ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లెకు చెందిన దళితుల చిరకాల కల నెరవేరింది. 40 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయడంతో దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోపవరం మండల పరిధిలో జెడ్‌పెహచ్‌డీసీ భూముల్లో ఏక్‌సాల్ అనుమతి ఉన్న దళితులకు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆకుల వెంకటరమణతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సుధ వ్యవసాయ భూమి పట్టాలను పంపిణీ చేశారు. గోపవరం రెవెన్యూ పొలం 1755 సర్వే నెంబరులో ఉన్న జెడ్‌హెచ్‌డీసీ భూములను గతంలో ఏక్‌సాల్ పర్మిషన్ కింద మడకలవారిపల్లెకు చెందిన దళితులకు కేటాయించారు. అయితే సదరు భూమిని రైతులు సాగు చేసుకోకపోవడంతో ఆ సర్వే నెంబరులోని 30 ఎకరాలు కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఎంఐజీ లేఅవుట్‌కు కేటాయించారు. ఈ నేపథ్యంలో దళితులు ఆందోళన చేపట్టడంతో జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు దళితులతో చర్చించి సెంచురీ పానెల్స్ సమీపంలో, మరికొన్ని సర్వే నెంబర్లలో ఒక్కో కుటుంబానికి 1.50 ఎకరాలు వ్యవసాయ భూమిని కేటాయించేటట్లు వారిని ఒప్పించారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో అర్హులైన దళితులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికే కృషి చేస్తోందని, ఆ క్రమంలోనే ఏ ఒక్క దళితునికి అన్యాయం జరగకుండా భూములు కేటాయించామని తెలిపారు. వారం రోజుల్లోనే అర్హులకు ఇంటి పట్టాలు కూడా పంపిణీ చేస్తామన్నారు. దళితుల సమస్యలను సున్నితంగా పరిష్కరించేందుకు కృషి చేసిన ఆర్డీఓకు, ఇతర అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పట్టాలు పొందిన దళితులు ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నాగం సుబ్బారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు రఘురామిరెడ్డి, కేశవరెడ్డి, స్థానిక నాయకులు గంగయ్య, చంద్ర, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


పట్టాలు అందుకున్న దళితులతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఆర్డీఓ వెంకటరమణ

సలాం.. పోలీస్!

అర్ధరాత్రి మహిళలకు సాయపడిన పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : వాహనాలు లేక అర్ధరాత్రి సమయంలో రైల్వే స్టేషన్ నుంచి నడుచుకుంటూ వెళ్తున్న తల్లీకూతుళ్లను పోలీసులు వారి వాహనంలో కూర్చోపెట్టుకొని ఇంటి వద్ద వదలిపెట్టారు. విజయవాడ నుంచి రైలులో వచ్చిన తల్లీకూతుళ్లు ఆదివారం రాత్రి 11.45 గంటల సమయంలో ప్రొద్దుటూరు శివారులోని రైల్వే స్టేషన్‌లో దిగారు. అయితే ఆ సమయంలో ఎలాంటి ఆటోలు లేకపోవడంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినా వారు లిఫ్ట్ చేయలేదు. దీంతో చేసేదేమి లేక ఇద్దరూ నడుచుకుంటూ వెళ్తుండగా పెట్రోలింగ్ పోలీసులు వారిని ఆపడంతో జరిగిన విషయాన్ని తెలిపారు. దిశ యాప్ గురించి వివరించిన పోలీసులు మహిళల సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్ లోడ్ చేశారు. వాహనాలు చెడిపోయినప్పుడు గానీ, బస్సులు, ఆటోలు తిరగని సమయాల్లో దిశ యాప్ ద్వారా పోలీసుల సాయాన్ని పొందవచ్చని సూచించారు. అంతేగాక ఏదైనా ముప్పు జరిగే అవకాశం ఉన్న సమయంలో కూడా యాప్‌కు సంబంధించిన ఎస్ఓఎస్ బటన్‌ను నొక్కినట్‌లైతే వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్షణగా నిలుస్తారని వివరించారు. తర్వాత మహిళలను వాహనంలో కూర్చోపెట్టుకొని హనుమాన్ నగర్‌లోని వారి ఇంటి వద్ద వదిలిపెట్టారు. అర్ధరాత్రి సమయంలో తమను క్షేమంగా ఇంటికి చేర్చిన సీఐ వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ తిరుమలకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.


తల్లీకూతుళ్లను వారి ఇంటి వద్ద వదిలిపెట్టిన సీఐ వెంకటరమణ, సిబ్బంది

30న జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 30వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. చిన్నపరెడ్డి, కార్యదర్శి సింధూరి తెలిపారు. 2008 జనవరి 1 తర్వాత పుట్టినవారు ఎంపికలకు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయో ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, స్టడీసర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు. బాలబాలికలకు నిర్వహించే ఈ ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హౌసింగ్ బోర్డ్‌కాలనీ శ్రీకోదండరామ స్వామి దేవాలయం ఆర్చీ ఎదురుగా సోమవారం మధ్యాహ్నం తిరుపతి నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు, ముందు వెళుతున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్ పరారయ్యారు. గాయపడిన వారిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.




రోడ్డు ప్రమాదంలో గాయపడినవారు

రోడ్డుప్రమాదంలో యువకుడికి గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని లింగాలకుంట సమీపంలో కడప–బద్వేలు ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బద్వేలు పట్టణం శ్రీకృష్ణ దేవరాయ నగర్‌కు చెందిన షణ్ముఖ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు షణ్ముఖ కడప వైపు నుంచి బద్వేలుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బద్వేలు డిపోకు చెందిన ఏపీ04జెడ్0066 నంబరు గల ఆర్టీసీ బస్సు కడపకు వెళుతూ లింగాలకుంట సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గాయపడిన యువకుడిని 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే గాయపడిన వ్యక్తి హెల్మెట్ ధరించి ఉండడంతో కొంతమేర ప్రమాదం తప్పిందని లేకుంటే అక్కడే మృత్యువాత పడేవాడని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

అట్లూరు : మండల పరిధిలోని జి.కొత్తపల్లె సమీపంలో 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సి.రాజు తెలిపారు. ఆయన వివరాల మేరకు జి.కొత్తపల్లె ఎస్టీకాలనీకి చెందిన ఉదయగిరి నిత్యపూజయ్య, సిద్దవటం మండలం పొన్నవోలు కొత్తపల్లె గ్రామానికి చెందిన పెరుగు లక్ష్మీనరసయ్యలు ఎర్రచందనం అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. దాడి నిర్వహించి 5 దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.